కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో కిలో కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. టమోట రూ. 23, వంకాయ రూ. 55, బెండకాయ రూ.55, పచ్చి మిర్చి రూ.35, బజ్జి మిర్చి రూ.60, కాకరకాయ రూ.32, బీరకాయ రూ.45, క్యాబేజీ రూ.35, బీన్స్ రూ.55, క్యారెట్ రూ.77, గోబి పువ్వు రూ.28, దొండకాయ రూ.32, చిక్కుడు కాయ రూ.75, గోరు చిక్కుడు రూ.45, బీట్‌రూట్ రూ.55, క్యాప్సికం రూ.75, ఆలుగడ్డ రూ.38, కీర రూ.17, దోసకాయ రూ.35, సొరకాయ రూ.25, పొట్లకాయ రూ.18, కంద రూ.65, ఉల్లిపొరక రూ. 45, ఉల్లిగడ్డ రూ.40, మామిడి కాయ రూ.15-20, అరటి కాయ రూ. 8-10, చామగడ్డ రూ.40, ముల్లంగి రూ.4-5, చిలగడదుంప రూ. 40, గుమ్మడికాయ రూ.30, నిమ్మకాయలు రూ. 50-60, మునగ కాయలు రూ. 8-10, బొప్పాయి రూ.40, పుట్టగొడుగులు రూ.40, ఎండు మిర్చి రూ.220, అల్లం రూ.160, వెల్లుల్లి రూ.380, చింతపండు రూ.140, పండు మిర్చి రూ.80, ఉసిరి రూ.80, కరివేపాకు రూ.70, పర్వల్ రూ.45, పల్లికాయ రూ.70, లోబా రూ.45, ఆ కాకరకాయ రూ.100. పైన పేర్కొన్న ధరలు సోమవారం ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఓటరు ప్రత్యేక క్యాంపులకు ఆదరణ కరువు



బీఎల్‌వోతో మాట్లాడుతున్న డీసీ వంశీకృష్ణ

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఈనెల 9, 10 తేదీల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు క్యాంపులకు ప్రజల నుంచి ఆదరణ లభించలేదు. సమగ్ర కుటుంబ సర్వే రావడంతో అధికార యంత్రాంగం కూడా దీనిపై పెద్దగా దృష్టిపెట్టలేదన్న విమర్శలు ఉన్నాయి. ఇటీవలే డీసీగా బాధ్యతలు చేపట్టినా వంశీకృష్ణ క్షేత్రస్థాయిలో బీఎల్‌వోలతో మాట్లాడి పలు సూచనలు చేసినా ఓటర్ల నుంచి స్పందన రాలేదు. రెండో శనివారం, ఆదివారం కావడంతో అధికారులు, సిబ్బంది పనిచేయడానికి కాస్త అయిష్టంగానే విధులు నిర్వహించారని చెప్పొచ్చు. కొత్త ఓటర్ల నమోదు, మార్పు చేర్పుల కోసం అవకాశం ఇచ్చినా అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రచారం కల్పించకపోవడంతో నామ్‌కే వాస్తే అన్న చందంగా ప్రత్యేక ఓటరు క్యాంపు ముగిసింది.

సత్కారం



టీటీడీ బోర్డు మెంబర్ నన్నూరి నర్సిరెడ్డిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరిస్తున్న కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన టీడీపీ తెలుగు యువత నాయకుడు కొర్రపాటి కిషోర్.

- కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి)

అయ్యప్ప మహా పడిపూజ



బాలాజీనగర్ వివేక్‌నగర్‌లో శ్రీకాంత్ ముదిరాజ్ ఆహ్వానం మేరకు ఆదివారం రాత్రి జరిగిన అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమానికి హాజరైన టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం, సాధు ప్రతాప్ రెడ్డి, కృష్ణరాజ్ పుత్ తదితరులు.

- కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి)

చెప్పాలా.. వద్దా?

- సమగ్ర కుటుంబ సర్వేపై సందేహాలు ఎన్నో
- వివరాలు చెబితే సంక్షేమ పథకాలు పోతాయేమోనని ప్రజల్లో ఆందోళన
- ఆడిటర్లు, ఫైనాన్షియల్ అడ్వైజర్ సలహాలు తీసుకుంటున్న సంపన్న వర్గాలు



కూకట్‌పల్లి సంగీత్‌నగర్‌లో ఇంటింటి కుటుంబ సర్వేలో డీసీ హరి కృష్ణయ్య

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే సామాన్య ప్రజల్నే కాదు.. సంపన్న వర్గాలను సైతం ఉక్కిరి బిక్కిరి చేస్తోందని చెప్పొచ్చు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో నివాసం ఉంటున్న పేదలతో పాటు సంపన్న వర్గాలు ఇక్కడ ఉంటున్నారు. దీంతో సమగ్ర కుటుంబ సర్వేలో ఏం చెప్పాలి.. ఏం చెప్ప కూడదు ఎవరికీ అంతుపట్టని ప్రశ్నగా మిగులుతోందని చెప్పొచ్చు. పేదలకు ఉన్నవి చెప్తే సంక్షేమ పథకాలు పోతాయని, పెద్దలకు ఇన్‌కమ్ ట్యాక్స్ నుంచి నోటీసులు వస్తాయని ఎవరికి ఉన్న అవగాహన వారు ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. ఎక్కడ నలుగురు కలిసినా ఏం చేద్దాం.. ఏ వివరాలు ఇస్తే బాగుంటుంది. మనం అన్నీ వివరాలు చెప్తే ఏంటి ? చెప్పకపోతే వచ్చే నష్టాలు ఏంటాని చర్చించుకుంటున్నారు. ఐదు రోజులుగా స్టిక్కర్లకే పరిమితం అయిన ఎన్యుమరేటర్లు.. సోమవారం నుంచి క్షేత్రస్థాయిలో సర్వేలో ప్రజల నుంచి ప్రశ్నలు వేసి సమాధానాలు వారికి ఇచ్చిన బుక్‌లెట్‌లో రాసుకోనున్నారు.

సమగ్ర కుటుంబ సర్వే.. సందేహాలు ఎన్నో?

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా పెట్టిన సమగ్ర కుటుంబ సర్వే గురించి ప్రజలకు అవగాహన కల్పించకుండా 75 ప్రశ్నలతో ఎన్యుమరేటర్లు ఇంటింటికి రావడం ఏంటని సామాన్య ప్రజలతో పాటు సంపన్న వర్గాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. స్టిక్కర్లు అంటించి వెంటనే ఎన్యుమరేటర్ ఇంటి యజమాని పేరు, ఫోన్ నంబర్ తీసుకొని రెండు రోజుల్లో మళ్లీ మీ ఇంటికి వస్తాం.. అప్పటి వరకు మీ ఆధార్ కార్డులు, ఇతరత్రా ఆస్తులకు సంబంధించిన వివరాలన్నీ దగ్గర పెట్టుకోండని చెప్పడంతో ఎందుకమ్మా? అని అప్పుడే ఎన్యుమరేటర్‌కు ప్రశ్నలు గుప్పించారు.

ఉన్నవి చెప్తే ఏంటి ? చెప్పక పోతే పరిస్థితి ఏంటి ?

మినీ ఇండియాగా చెప్పుకొనే కేపీహెచ్‌బీ ప్రాంతంలో అట్టడుగున ఉండే కటిక పేదలతో పాటు సంపన్న వర్గాలకు నిలయంగా చెప్పొచ్చు. రోజు వారీ కూలీ చేసుకునే వారు సైతం చాలా మంది పిల్లలను ప్రైవేట్ స్కూల్లో చదివిస్తున్నారు. ఎంతో కొంత బ్యాంకులు, పోస్టాఫీసుల్లో జమచేసుకుంటూనే జీవిత బీమా పాలుసీలు తీసుకుంటున్నారు. వీటికి తోడు ఇక్కడ సంపాదించిన దాంట్లో వారికి స్తోమతకు తగ్గట్టు సొంత ఊరిలో నివాసం ఏర్పాటు చేసుకోవడం, అక్కడ పొలాలు కొనుక్కోవడం జరుగుతూ ఉంది. అర్హత లేకున్నా రేషన్ కార్డులు కలిగి ఉండడం ఇప్పుడు సమగ్ర కుటుంబ సర్వేలో పోవడం ఖాయమనే భయం ఎక్కువ మందిలో ఉంది. బ్యాంక్ అకౌంట్లతో పాటు ట్యాక్స్ పేయరా కాదా? స్థిర, చరాస్థులు ఎంత? మీరు ఉంటే ఇంటి విస్తీర్ణం ఇలా గుచ్చిగుచ్చి ప్రశ్నలు ఉండడంతో గవర్నమెంట్ వాల్యు చెప్పాలా లేక మార్కెట్‌లో ఉన్న ధరల ప్రకారం చెప్పాలా? సొంత ఇల్లు ఉన్నా 60ఏళ్లు పైబడిన వారు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే వృద్ధాప్య పింఛన్‌తో జీవనం సాగిస్తున్న వారు ఎందరో ? వీటి ఆధారంగా తక్షణమే మేలు జరగడం ఏమో కాని నష్టమే ఎక్కువగా ఉంటుందని పేదలు, మధ్యతరగతి వారు భయపడుతున్నారు. ఎగువ మధ్యతరగతి, సంపన్న వర్గాల ప్రజలు అయితే ఎక్కువగా వ్యాపారాలు చేసుకునే వారు కావడంతో లావాదేవీలు ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహా మేరకు ఆడిటర్లే చూసుకుంటారు. తాజాగా వచ్చే ఎన్యుమరేటర్లకు ఏం చెప్పాలి. ఉన్న విషయాలు చెబితే కలిగే ప్రయోజనాలు ఏంటి? చెప్పకపోతే వచ్చే నష్టాలు ఏంటో చెప్పాలని ఆర్థిక సలహాలదారులను సంప్రదిస్తున్నారు. మీరు అయితే ఎంత మేరకు ఐటీ రిటర్న్, జీఎస్టీ ఫైల్ చేస్తున్నారో అంత వరకే చెప్పండి.. తర్వాత ఏమైనా క్వైరీలు, నోటీసులు వస్తే గతంలో మీకు ఇచ్చిన విధంగానే సేవలు మేము అందిస్తాం. దీని గురించి పెద్దగా ఆలోచించాల్సిన అవసరం లేదని కొట్టిపారేస్తున్నారట.

మనం ఇచ్చేదే రాసుకుంటారంట?

ప్రభుత్వం ఏ సర్వే చేస్తే మనకేంటి? మనం ఇచ్చే వివరాలు మనం ఇద్దాం. మన ఆస్తిపాస్తుల గురించి ఏమైనా ఎంక్వైరీ చేస్తారా ఏంటి ? మనం ఏ వివరాలు చెబితే అవే రాసుకుంటారు. దీని గురించి భయపడాల్సిన అవసరం ఏమీ లేదని కొద్దరు సర్వే గురించి కొట్టిపారేస్తున్నారు. ఇదిఇలా ఉండగా.. గత ప్రభుత్వంలో కూడా ఒకరోజు సర్వే చేశారు.. మాకు ఏం ప్రయోజనం కలగలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రజా పాలన దరఖాస్తులు ఇచ్చింది. ఇంత వరకు సర్వే చేయలేదు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి అయితే ప్రజా పాలన ఏమైందని ప్రశ్నిస్తున్నారు. సమగ్ర కుటుంబ సర్వే ఎలా చేస్తారో.. ప్రజలు ఎలాంటి వివరాలు ఇస్తారో చూడాలి మరి.

- మూసాపేట్‌లోని ఓ బస్తీలో ఉండే కనకయ్య అయ్యా మేము 30 ఏళ్ల క్రితమే బతుకు దెరువు కోసం ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చి ఇక్కడే స్థిరపడ్డాం. చిన్నపాటి ఇంట్లో ఉంటూ మేము తెలంగాణ రేషన్‌కార్డు, ఆరోగ్య శ్రీతో పాటు మా కుమారులు పని చేసే కంపెనీల్లో ఈఎస్ఐ కార్డు ఉంది. అందులో వైద్య చికిత్సలకు ఉంది. మా పిల్లలకు పెళ్లిళ్లు చేసే పనిలో ఉన్నా. ఈ సమయంలో నేను ఉండే రేకుల షెడ్డు గురించి, ఈఎస్ఐ గురించి చెప్తే పరిస్థితి ఏంటి? మా రేషన్ కార్డు తీసేస్తే మాకు వచ్చే ఇందిరమ్మ ఇంటికి రూ. 5లక్షలు, రూ.500కే గ్యాస్‌బండ, 200యూనిట్ల వరకు కరెంట్ ఫ్రీ పోతాయా..? అంటూ ఆందోళన చెందుతున్నారు.
- బాలాజీనగర్‌లో నివాసం ఉండే మధ్యతరగతి కుటుంబానికి చెందిన సుబ్బారావు తెలంగాణలోని మహబూబ్‌నగర్ నుంచి వచ్చి 15 ఏళ్లు ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. సొంత ఊరిలోనే రేషన్ కార్డు ఉంది.. రైతు బంధు కూడా ఇటీవల అకౌంట్‌లో జమ అయింది. నెలకు రూ.40వేల జీతానికి పనిచేస్తూ తన ఇద్దరు పిల్లలను ప్రైవేటు స్కూల్లో చదివిస్తూ అనారోగ్య సమస్యలు వస్తే తన కంపెనీ ఇన్సూరెన్స్ వాడుకుంటూ వచ్చారు. తాజాగా సమగ్ర కుటుంబ సర్వేలో ఇవన్నీ చెబితే సొంత ఊరిలో జాగా ఉంది. అందులో ఇల్లు కట్టుకుంటే రూ. 5లక్షలు ఇందిరమ్మ ఇంటి కింద ఇస్తారని, మా పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కిందవచ్చే బెనిఫిట్స్ పోతాయని ఆందోళనలో ఉన్నారు.

పైన పేర్కొన్న ఇద్దరే కాదు.. ఇలా చాలా మంది ఏం చేయాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. పనిచేసే చోట, అడ్డా మీద, తెలిసిన వారిని అడుగుతూ ముందుకు సాగుతున్నారు. ఏం చెప్పాలో ఏం చెప్పకూడదో తెలియక తమలో తామే మథనపడుతున్నారు.

నేడు ప్రజావాణి

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంతో పాటు కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిల్ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి ఉంటుంది. జీహెచ్ఎంసీకి సంబంధించిన రోడ్లు, ఫుట్‌పాత్ ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు, పారిశుధ్యం, దోమలు, వీధి దీపాలు ఇతరత్రా సమస్యలు ఏమున్నా జడ్సీ, డీసీలకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసి సమాధానం కోరవచ్చు. సర్కిళ్ల పరిధిలో ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోతే వాటి గురించి జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయవచ్చు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): టీజీఎస్‌పీడీసీఎల్ వసంతనగర్, కేపీహెచ్‌బీ విద్యుత్ సెక్షన్ల పరిధిలో ఫీడర్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కోసం సోమవారం పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈలు వాణి, విజయ ప్రకాష్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎస్ఎస్ కాలనీ, ధర్మారెడ్డి ఫేజ్-2, కేపీహెచ్‌బీ తొమ్మిదో ఫేజ్, సాయిహిల్స్, ఆరో ఫేజ్, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5 గంటల వరకు సర్దార్‌పటేల్‌నగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుతు సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు ముందస్తుగా గమనించి ఆయా సమయాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఏఈలు కోరారు.

వెంకటేశ్వర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సర్దార్‌పటేల్‌నగర్‌లోని శ్రీలక్ష్మీ గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 12వ తేదీ నుంచి 3 రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 23న సాయంత్రం 5 గంటలకు ధాత్రి కల్యాణం నిర్వహిస్తున్నామని, మహిళలు అందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. పవిత్రోత్సవాల్లో పాల్గొనే భక్తులకు పవిత్రం ఇస్తామని పేర్కొన్నారు.

ప్రజలకు అండగా ఉండాలి



కార్పొరేటర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

హైదర్‌నగర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చినా కార్పొరేటర్లు, నాయకులు అండగా ఉండాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచించారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలో కార్పొరేటర్లతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. డివిజన్లలో సమస్యలు, జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి బ్రహ్మరథం పట్టి రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజలను ఎప్పటికీ మరువకూడదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ పెండింగ్ పనులు, నిధుల కొరత ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నరసింహ యాదవ్, రవీందర్‌రెడ్డి, సతీష్‌గౌడ్, సత్యనారాయణ, శిరీషబాబురావు, సభియ గౌసుద్దీన్, శ్రీనివాసరావు, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షులు మహ్మద్ గౌసుద్దీన్, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖరరెడ్డికి సత్కారం



చంద్రశేఖరరెడ్డిని సన్మానిస్తున్న బండి మధుసూదనరెడ్డి తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రెయిన్‌బో విష్టాస్ రాక్ గార్డెన్ అధ్యక్షుడు బండి మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం వాకర్స్ ఫ్రీడం ఆయిల్ సంస్థ సేల్స్ అండ్ మార్కెటింగ్ వైస్‌ప్రెసిడెంట్ పరెడ్డి చంద్రశేఖరరెడ్డిని శాలువాతో సత్కరించారు. కంపెనీ సీఎస్ఆర్ నిధులతో రూ. 2.76 కోట్లతో అత్యంత సుందరంగా పార్కును అభివృద్ధి చేసిన చంద్రశేఖరరెడ్డి కృషి, పాలనారమైన అనుమతులను త్వరగా తెప్పించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు మధుసూనదనరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రమణారెడ్డి, రమేష్‌రెడ్డి, సంజీవరెడ్డి, వెంకట్‌రెడ్డి, శివనాగేశ్వరరావు, ఇంద్రారెడ్డి, సెగ అనిల్, అరవింద్‌రెడ్డి, సిద్దారెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులు తీసుకోవాలి



సమావేశంలో భవన నిర్మాణ సంఘం నాయకులు

హైదర్‌నగర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం భవన నిర్మాణ కార్మిక సంఘం విస్తృత సమావేశం సీపీఐ కార్యదర్శి జి.కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగప్ప, పరమేష్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు బాలాజీ పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... భవన నిర్మాణ సంక్షేమ మండలి నుంచి ప్రభుత్వ గుర్తింపు కార్డులు, యూనియన్ సభ్యత్వం తీసుకోవాలన్నారు. అనంతరం మండల స్థాయి భవన నిర్మాణ కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ సంఘం నాయకులు, సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ



గ్రామస్థులతో మాట్లాడుతున్న సీపీ అవినాష్ మహంతి

శంషాబాద్ రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాలతో 90 శాతం నేరాలను తగ్గించవచ్చని సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి అన్నారు. శనివారం రాత్రి రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధిలోని జూకల్‌లో చౌడమ్మ ఆలయంపై దాడి జరిగిన విషయాన్ని తెలుసుకున్న సీపీ ఆదివారం ఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడారు. ప్రతీ గ్రామంలో ఆలయాలు, మసీదులు ఉంటాయని, అన్నిటికీ పోలీసులు రక్షణ కల్పించలేరన్నారు. వాటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల దాడులు జరగకుండా చూడవచ్చన్నారు. ఒకవేళ దాడులు జరిగితే ప్రజలు సంయమనం పాటించాలని సూచించారు. దేవాలయలపై వరుసగా జరుగుతున్న దాడులపై పోలీస్‌శాఖ సీరియస్‌గా ఉందని చెప్పారు. నిందితులను ఎట్టి పరిస్థితుల్లో వదిలేది లేదని స్పష్టం చేశారు. అంతకుముందు శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను సీపీ సందర్శించారు. కేసు వివరాలను కిందిస్థాయి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీసీపీ రాజేష్, అడిషనల్ డీసీపీ రామ్‌కుమార్, ఏసీపీ శ్రీనివాస్‌రావు, సీఐ నరేందర్‌రెడ్డి ఉన్నారు.

దత్తోపంత్ జయంతి



దత్తోపంత్‌కు నివాళులర్పిస్తున్న కేశవ్ సోనీ తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి జేఎన్‌టీయూ క్యాంపస్‌లో ఆదివారం స్వదేశీ జాగరణ మంచ్ స్థాపకులు దత్తోపంత్ తెంగడి జయంతి వేడుకలను నిర్వహించారు. ప్రాంత ప్రచార ప్రముఖ్ ఇన్‌చార్జి కేశవ్ సోనీ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1991లో దేశాన్ని ఆర్థిక పరంగా శక్తివంతంగా చేయాలనే లక్ష్యంతో స్వదేశీ జాగరణ మంచ్‌ను స్థాపించారన్నారు. ఏబీవీపీ, బీఎంఎస్, భారతీయ కిసాన్ సంఘ్ వంటి వాటిల్లో ప్రధాన పాత్ర పోశించి, సామాజిక ఆర్థిక సమస్యలకు పరిష్కారం చూపారన్నారు. కార్యక్రమంలో ఆదిత్య, రామ్‌చరణ్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో హరికృష్ణ, హరి సురేష్ తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నందమూరి సుహాసిని అక్క యువసేన అధ్యక్షు డు హరి సురేష్ ఆధ్వర్యంలో బాలాజీనగర్ డివిజన్ పరిధి కేపీహెచ్‌బీ ధనలక్ష్మి సెంటర్‌లో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి మాజీ టీడీపీ తెలంగాణ అధ్యక్షుడు తాలికోట హరికృష్ణ హాజరై సభ్యత్వాలు చేస్తున్న తీరును చూసి అభినందించారు. అర్హులు అయిన ప్రతి ఒక్కరూ రూ.100 చెల్లించి పార్టీ సభ్యత్వం తీసుకొంటే రూ.5లక్షల ప్రమాద భీమా సౌకర్యం కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. టీడీపీ సభ్యత్వం కుటుంబ సభ్యులకు భరోసా ఇస్తుందన్నారు. పార్టీ అభిమానులు, కార్యకర్తలు సభ్యత్వం తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అన్నీ ప్రాంతాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాలు నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న హరి సురేష్‌కు అభినందనలు తెలిపారు.

ప్రయాణికుల పడిగాపులు

- ఉదయం పదిన్నర తర్వాత ఎంఎంటీఎస్ రద్దు
- తగ్గుతున్న ఆదరణ
- రాకపోకల సమాచారంలో లోపం
- విలువైన సమయాన్ని కోల్పోతున్న ప్రయాణికులు

రెండు దశాబ్దాలుగా ఎంఎంటీఎస్ రైళ్లకు ఆదరణ తగ్గేలా ఉంది రైల్వే అధికారుల తీరు. ఎంఎంటీఎస్ రైళ్ల సమస్య ఇప్పటికీ ఒక కొలిక్కి రాలేదు. రైళ్ల రద్దు, రాకపోకల సమాచారం, సమయపాలన సక్రమంగా లేకపోవడంతో ఎంఎంటీఎస్ ఎక్కాలంటేనే ప్రయాణికులు వెనకడుగు వేస్తున్నారు. ప్రయాణికులకు సమయపాలన తెలియక స్టేషన్‌లో పడిగాపులు కాయాల్సివస్తోంది. ఎంఎంటీఎస్ రైళ్లలో ప్రయాణికుల లేమి కారణంగా మధ్యాహ్నపు రైళ్లను ఆ శాఖ రద్దు చేసినట్టు తెలుస్తోంది.

- అల్లాపూర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి)

హైటెక్ సిటీలో చిరు ఉద్యోగుల నుంచి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల వరకు హఫీజ్‌పేట, బోరబండ, హైటెక్‌సిటీ, భరత్ నగర్, ఫతేనగర్ రూట్లలో ఎంఎంటీఎస్ రైళ్లలో రద్దీ అధికంగా ఉంటుంది. హైటెక్ సిటీకి ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఇటీవల ఘట్‌కేసర్, మేడ్చల్ నుంచి కూడా ఎంఎంటీఎస్ రైళ్లను దక్షిణమధ్య రైల్వే ప్రారంభించింది. కానీ లింగంపల్లి-హైద్రాబాద్, లింగంపల్లి-ఫలక్‌నుమ స్టేషన్ల నడుమ, ఉప్పుగూడ, యాకుత్‌పుర నుంచి లింగంపల్లి వైపు కూడా ఎంఎంటీఎస్ సర్వీసులు రద్దు చేయడంతో ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం కల్గుతోంది. మధ్యాహ్నపు సర్వీసులు పునఃప్రారంభించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బోరబండ ఎంఎంటీఎస్ స్టేషన్‌లో రైలు కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు (ఫైల్)

రైల్వే శాఖలో లోపించిన సేవా భావం

ప్రజా రవాణా ముఖ్య ఉద్దేశ్యం లాభార్జన కాకూడదు. ప్రజా సౌకర్యార్థం నడపాలి. ముంబై, చెన్నైలలో సక్సెస్‌ఫుల్‌గా నడుస్తున్న లోకల్ రైళ్లు హైదరాబాదులో మాత్రం ఆదరణకు దూరం కావడానికి కారణాలేంటో మరి. ప్రజలకన్నా రైల్వే శాఖదే బాధ్యత అని సగటు ప్రయాణికుడి విశ్వాసం. జపాన్‌లో ఒక్క చిన్నారిని ఎక్కించుకునేందుకు ఏళ్ల తరబడి బస్సును అక్కడి ప్రజారవాణా సంస్థ నడిపింది. కానీ హైదరాబాద్‌లో ప్రయాణికులు లేరన్న సాకుతో మధ్యాహ్నపు రైళ్లను రద్దు చేసిన ఆ శాఖాధికారులు పునరాలోచించాలి.

అరగంట ప్రయాణం.. గంటన్నర ఆలస్యం

ఉదయం, సాయంత్రం ఆఫీసు సమయాల్లో ఎంఎంటీఎస్ రైళ్ల సర్వీసుల్లో సమయపాలన ఉన్నప్పటికీ మిగతా సమయాల్లో లోపిస్తోందని, పావుగంట, అరగంట ప్రయాణానికి గంటన్నర దాకా నిరీక్షించాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. రాత్రి 8 గంటల తర్వాత ఫతేనగర్ నుంచి లింగంపల్లికి వెళ్లాల్సిన ఎంఎంటీఎస్ రైళ్లు ఏ సమయానికి వస్తాయో తెలియదు. రైల్వే సిబ్బంది కూడా చెప్పలేక పోతున్నారు.

ఫ్రీక్వెన్సీకి ప్రాధాన్యం

ఒక్కో ఎంఎంటీఎస్‌కు 12 బోగీలు ఉంటాయి. ఇవి పీక్ అవర్స్‌లో ప్రయాణికులతో నిండుగా ఉంటున్నాయి తప్ప మిగతా సమయాల్లో అన్ని బోగీలు నిండడం లేదు. ఇన్ని బోగీలతో గంట, రెండు గంటల ఒక్కొక్కటి తిప్పేకన్నా ఆరు బోగీలతో రైళ్లను తిప్పి వాటి ఫ్రీక్వెన్సీ రెట్టింపు చేస్తే ఎక్కువ మంది ప్రయాణికులకు ఉపయోగంగా ఉంటుంది.

సర్వీసుల సంఖ్య పెంచాలి



ఫతేనగర్‌లో ఓ ప్రైవేట్ ఉద్యోగిని. ఎంఎంటీఎస్ అందుబాటులో ఉండడం మంచిదే, సర్వీసుల సంఖ్య పెంచితే బాగుంటుంది. ఒక్కోసారి గంట వరకు వేచి చూడాల్సి వస్తోంది.

- భారతి, ఉద్యోగి, ఎంఎంటీఎస్ వినియోగదారు

రైలు మిస్సయితే అంతే..



లక్డీకాపుల్‌లోని ఓ ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేస్తాను. ఉదయం హైటెక్ సిటీ స్టేషన్‌లో రైలు ఎక్కి సమయానికి ఆఫీసుకు చేరుకోగల్గుతున్నా. ఒకవేళ అది మిస్సయితే అంతే సంగతి. తదుపరి ట్రైన్ మరో గంటకి వస్తుందో రాదో కూడా తెలిని పరిస్థితి. రైళ్ల సంఖ్య పెంచాలి.

- సిద్ధేశ్వర్, ఉద్యోగి, లక్డీకాపుల్

గతంలో సమాచారం ఉండేది

సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ వంటి ముఖ్యమైన స్టేషన్లలోనే కాకుండా డబీర్‌పుర, ఫతేనగర్, నెక్లెస్ రోడ్ వంటి చిన్న స్టేషన్లలో రైళ్ల రాకపోకలకు, రైళ్ల వర్తమాన స్థితిగతుల సమాచారం తెలిపేందుకు టీవీలు ఉండేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. దీంతో రైలు ఎప్పుడొస్తుందో తెలియక ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గం చూసుకుంటున్నారు.


విజేతలకు ట్రోఫీలు ప్రదానం



కేపీహెచ్‌బీ ఆరోఫేజ్ ఇండోర్ స్టేడియంలో రెడు రోజులుగా నిర్వహించిన ట్రై కమ్యూనిటీ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ముగిశాయి. ఇండిస్ వన్ సిటీ, రెయిన్‌ట్రీ పార్కు, లోధా మెరీడియన్ గేటెడ్ కమ్యూనిటీలు సంయుక్తంగా కలిసి ఈ పోటీలు నిర్వహించాయి. విజేతలకు ఆదివారం సాయంత్రం నిర్వాహకులు ట్రోఫీలను ప్రదానం చేశారు. - కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి)

తెలంగాణ డ్రగ్స్ ఫ్రీ 2కే రన్ పోస్టర్ ఆవిష్కరణ

రాయదుర్గం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్యాసమితి ఆధ్వర్యంలో డిసెంబర్ 21న నక్లెస్ రోడ్డులో డ్రగ్స్ ఫ్రీ 2కే రన్ నిర్వహించనున్నారు. దీనికి సంబం ధించిన పోస్టర్‌ను ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం రెడ్డి నరేందర్‌రెడ్డి చేతుల మీదుగా గచ్చిబౌలిలోని రోలింగ్‌హిల్స్‌లో ఆయన నివాసంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్యాసమితి అధ్యక్షుడు తారక్‌గౌడ్, రవికుమార్, లయన్స్ క్లబ్‌మెంబర్స్ అశోక్, నాయుడు, రమేష్, బెల్లంకొండ రామ్‌ప్రసాద్, భరత్ దాచేపల్లి, రామ్‌గౌడ్ పాల్గొన్నారు.



దీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఆలయ ఫౌండర్ చైర్మన్ రమణమూర్తి

ఘనంగా దీపోత్సవం

చందానగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చందానగర్ శిల్పాఎన్‌క్లేవ్ లక్ష్మీగణపతి ఆలయంలో ఆదివారం లక్ష దీపోత్సవం ఘనంగా జరిగింది. ముందుకు స్వామికి పంచామృతాభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ఫౌండర్ చైర్మన్ యువి రమణమూర్తి లక్షదీనోత్సవ కార్యక్రమాన్ని దీపాలను వెలిగించి ప్రారంభించారు. పరిసర కాలనీల నుంచి మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

చిరుతిళ్లు తింటున్నారా.. జరభద్రం

- నాణ్యత, శుభ్రత పాటించని వ్యాపారులు
- పట్టించుకోని అధికారులు

రాయదుర్గం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రోడ్ల పక్కన విక్రయించే చిరుతిళ్లు చూస్తుంటే నోరూరుతుంది.. నూడిల్స్, మంచూరియా, పానీపూరి, చాట్ మసాలాలు.. అబ్బో అనిపిస్తుంటాయి... వాటిని తినాలని మనసు లాగుతుంది. వాటిని తిన్నామా అనారోగ్యానికి గురికాక తప్పదు. తినేటప్పుడు జాగ్రత్తలు పాటించాలంటున్నారు వైద్యులు.

రాయదుర్గం, గచ్చిబౌలి, చందానగర్, శేరిలింగంపల్లి, కొండాపూర్, మాదాపూర్, హైటెక్‌సిటీ, హఫీజ్‌పేట, మియాపూర్‌తో పాటు నియోజకవర్గంలో ఉన్న ప్రధాన రహదారుల్లో విక్రయించే చిరుతిళ్ల (ఫాస్ట్‌ఫుడ్) వ్యాపారం మూడు ప్లేట్లు ఆరు పార్శిల్లుగా సాగుతోంది. కాలానికి అనుగుణంగా మొబైల్ వాహనాల ద్వారా విక్రయాలు చేస్తున్నారు. కంటికి ఇంపుగా మసాలా గుమగుమలతో కూడిన ఆహారం ఇట్టే ప్రజలను ఆకట్టుకుంటుంది. వాటిని చూస్తుంటే తినాలనిపిస్తుంది. వాటిని తయారు సమయంలో యజమానులు ఎటువంటి నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారో తెలియదు. వాటిని తరుచూ తింటే అనారోగ్యం తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అమీబీయాసిస్, మలబద్దకం తదితర సమస్యలు తలెత్తుతాయని హెచ్చరిస్తున్నారు. ఎక్కువగా తినేవారు ఊబకాయలుగా... లేదంటే బక్కచిక్కడమో జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు.





ఫాస్ట్‌ఫుడ్, పానీపూరి, సెంటర్లు

పరిశుభ్రత కరువు

విద్యార్థులు, యువత ఎక్కువగా ఇష్టపడేది పానీపూరి. వాటిని నీటితో నింపి ఇచ్చే క్రమంలో బ్యాక్టీరియా, ఫంగస్ మన శరీరంలోకి ప్రవేశించే ప్రమాదం ఉంది. పానీపూరీలో చాట్ నింపిన అనంతరం పూరీలను ప్రత్యేకంగా తయారు చేసిన నీటిలో ముంచి వినియోగదారుడికి అందిస్తుంటారు.

వ్యాపారం జరిగే నాలుగైదు గంటల సమయం ఆ వ్యాపారి చేతులు నీళ్లలో నానుతూనే ఉంటాయి. వేళ్ల సందుల్లో, గోళ్ల మధ్య ప్రమాదకర ఫంగస్ చేరుతుంది. మిగిలిపోయిన చాట్‌ను కొందరు వ్యాపారులు మరుసటి రోజు వినియోగిస్తుంటారు. చాట్‌లో బ్యాక్టీరియా, వైరస్‌పొంచి ఉండే ప్రమాదం ఉంది. అందుకే బయట ఇరుతిళ్లు తినకుండా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామని నిపునులు అంటున్నారు.



అవార్డు అందుకుంటున్న ఎస్‌కే ఖాసీం

బెస్ట్ మేనేజర్ ఆఫ్‌ద పార్కు.. ఖాసీం

గచ్చిబౌలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గుల్‌మొహర్‌పార్కు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పార్కు నిర్వహణ విషయంలో కాలనీ అధ్యక్షుడు ఎస్‌కె ఖాసీంకు బెస్ట్ మేనేజర్ ఆఫ్‌ద పార్కు అవార్డు లభించింది. ఆదివారం గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కళాశాలలో జరిగిన 11 నేషనల్ కాన్ఫరేన్స్ ఆఫ్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ అవార్డు దక్కింది. కొన్నేళ్లుగా పార్కు నిర్వహణ విషయంలో ఖాసీం తీసుకుంటున్న చర్యలు అధికారులను ఆకర్షించాయి. వందలాదిమంది పార్కులో సేద తీరేందుకు వస్తుంటారు. వారందరిని ఆకట్టుకునేలా పార్కును తీర్చిదిద్దడంలో ఆయన తీసుకున్న చర్యలకు అవార్డు వరించింది. తనకు అవార్డు రావడానికి సహకరించిన జీహెచ్‌ఎంసీ అధికారులు, కాలనీ సంక్షేమసంఘం సభ్యులు, పారిశుధ్య నిర్వహణ కార్మికుల సహకారాలతో తనకు ఈ అవార్డు వచ్చిందని ఖాసీం వారందరికి కృతజ్ఞతలు తెలిపారు.

రూ. 200 కోట్లతో కమ్మ సేవా భవనం

- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని కమ్మ కులస్థుల సంక్షేమానికి హైదరాబాద్‌లో రెండు వందల కోట్లతో కమ్మ సేవా భవనాన్ని నిర్మించబోతున్నట్టు తెలంగాణ రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్, రాష్ట్ర కమ్మసేవా సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ వెల్లడించారు. కమ్మసేవా సమితి షాద్‌నగర్ తాలుకా అధ్యక్షుడు పాతూరి వెంకటరావు ఆధ్వర్యంలో ఆదివారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని ఎంపీ శేషయ్యనగర్‌లో కార్తీక మాస వనభోజన మహోత్సవం జరిగింది.



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఆటపాటలతో వన భోజనోత్సవాన్ని ఆహ్లాదంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గాంధీ మాట్లాడుతూ తెలంగాణాలోని కొన్ని దుష్టశక్తులు కమ్మవారిపై విషం చిమ్ముతూ, ద్రోహులుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రంలోని కమ్మవారందరు ఏకతాటిపైకి వచ్చి దుష్టశక్తుల కుట్రలను విచ్ఛిన్నం చేయాలని పిలుపునిచ్చారు. ఎవరు ఏమి చేసినా... కష్టాన్ని నమ్ముకుని జీవనం గడుపుతున్న కమ్మ కులస్థులకు తాను అండగా నిలిచి, అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తానని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. ఈ సందర్భంగా బాలానగర్‌కు చెందిన గిరిజన విద్యార్థి పాత్లావత్ రఘు ఎంబీబీఎస్ చదువు కోసం కమ్మ సేవా సమితి మహిళా సభ్యులు రూ.25 వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో కమ్మ సేవా సమితి నాయకులు తాళ్లూరి జీవన్, అడుసుమల్లి వేంకటేశ్వర్‌రావు, పూర్ణచందర్‌రావు, రవీంద్ర, పినపాక ప్రభాకర్‌రావు, గుదే వసంతరావు, బి.నాగేశ్వర్‌రావు, శ్రీనివాసరావు, రామసుబ్బరావు, హరికృష్ణ, నాగేశ్వర్ రావు, రఘు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

హైదర్‌నగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు వైద్యచికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా ఆరుగురు లబ్ధిదారులకు రూ.3,18,000 మంజూరయ్యాయి. ఆదివారం ఎమ్మెల్యే తన కార్యాలయంలో వారి కుటుంబ సభ్యులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యానికి గురై ఆర్థిక స్థోమత లేక ఆస్పత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు, అభాగ్యులకు అండగా, సీఎం సహాయనిధి ఆర్థిక భరోసా నిస్తుందని తెలిపారు.



సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, దామోదర్‌రెడ్డి, మంత్రి ప్రగడ సత్యనారాయణరావు పాల్గొన్నారు.

ఇంటింటికీ ఎన్యూమరేటర్లు

- కొనసాగుతున్న కులగణన సర్వే

చందానగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చందానగర్ సర్కిల్ పరిధిలోని మాదాపూర్, హఫీజ్‌పేట, మియాపూర్, చందానగర్ డివిజన్‌లో ఆదివారం కూడా ఇంటింటి సర్వే కొనసాగింది. సర్కిల్ పరిధిలో 820 మంది ఎన్యూమరేటర్లు సర్వేను నిర్వహించారు. ఈ సర్వేలో సుమారుగా 3319 ఇళ్ల సమాచారాన్ని సేకరించారు. సర్వే జరుగుతున్న కాలనీలో సూపర్‌వైజర్లతో పాటు నోడల్ ఆఫీసర్లు పరిశీలించారు.



కార్పొరేటర్ మంజులరెడ్డి ఇంటి వద్ద సర్వే తీరును పరిశీలిస్తున్న జడ్సీ, డీసీ, అధికారులు

నోడల్ ఆఫీసర్ పరిశీలన...

చందానగర్ సర్కిల్ పరిధిలో జరుగుతున్న వివిధ కాలనీల్లో ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు సర్వే చేస్తున్న విధానాన్ని ఆదివారం జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి, కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా ప్రతి ఎన్యూమరేటర్ సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ కులగణనను తీసుకునే సమయంలో మార్గదర్శకాల పుస్తకంలో సూచించిన ప్రకారం నమోదు చేయాలన్నారు.



కులగణన సర్వేను పరిశీలిస్తున్న నోడల్ ఆఫీసర్ మయాక్‌మిట్టల్

జడ్సీ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్యూమరేటర్లు చేస్తున్న సర్వేను సూపర్‌వైజర్లు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు సర్వే సిబ్బందికి సహకరించి సమాచారం ఇవ్వాలని కోరారు. సర్వే పై అనుమానాలు, అపోహలు ఉంటే వెంటనే నివృత్తి చేయాల్సిన బాధ్యత సూపర్‌వైజర్లు, నోడల్ ఆఫీసర్లపై ఉందన్నారు. అనంతరం కార్పొరేటర్ మంజులరెడ్డి మాట్లాడుతూ ప్రజలు సర్వే సిబ్బందికి సహకరించాలని సూచించారు.

వెస్ట్‌జోన్ పరిధిలో...

గచ్చిబౌలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ పరిధిలోని కులగణన, ఇంటింటి సర్వేను వెస్ట్‌జోన్ సర్వే నోడల్ ఆఫీసర్ (ఐఏఎస్) మయాక్‌మిట్టల్ పర్యవేక్షించారు. నల్లగండ్ల లక్ష్మీవిహార్, డిఫెన్స్‌కాలనీ, మియాపూర్, మాదాపూర్, గచ్చిబౌలి తదితర ప్రాంతాల్లో సర్వే విధానాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎన్యూరేటర్లకు ఏవిధంగా సమాధానాలు ఇస్తున్నారని అడిగి తెలుసుకున్నారు.

డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదాం

- కొండాపూర్ చౌరస్తా నుంచి మాదాపూర్ వరకు ర్యాలీ

గచ్చిబౌలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): యువత మేలుకో అనే నినాదంతో ఏఐఎస్ఎఫ్ శేరిలింగంపల్లి కమిటీ ఆధ్వర్యంలో కొండాపూర్ చౌరస్తా నుంచి మాదాపూర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర సీపీఐ నాయకుడు రామకృష్ణ హాజరై యువతను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిన రాష్ట్రంలో డ్రగ్స్‌ను నివారించలేకపోతున్నారని, ఎన్నికలకు ముందు అన్ని పార్టీలు డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడతామని హామీలు ఇచ్చి గెలిచిన తర్వాత గాలికి వదిలేస్తారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నేరవర్చాలని డిమాండ్ చేశారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, స్థానికులు

కార్యక్రమంలో సీఆర్ ఫౌండేషన్ ఇన్‌చార్జి డాక్టర్ రజని మాట్లాడుతూ విదేశాలు, ఇతర రాష్ట్రాల నుంచి నగరానికి డ్రగ్స్ సరఫరా ఇచ్చిలవిడిగా సాగుతుందని, ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించడం దారుణమన్నారు. డ్రగ్స్‌తో యువత జీవితాలు నాశనం అవడమే కాకుండా వారి తల్లిదండ్రులు రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వం డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలని డిమాండ్ చేశారు. డ్రగ్స్ సరఫరా దారులు కళాశాలలు, పాఠశాలలను టార్గెట్ చేసుకుని దందా చేస్తున్న ముఠాలకు అడ్డుకట్ట వేయాలన్నారు.

కార్యక్రమంలో ఏఐటీయూసీ రంగారెడ్డిజిల్లా కార్యదర్శి చందుయాదవ్, డీహెచ్‌ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటస్వామి, సుధాకర్, నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

2కే రన్ పోస్టర్ ఆవిష్కరణ

రాయదుర్గం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్యాసమితి ఆధ్వర్యంలో డిసెంబర్ 21న నక్లెస్ రోడ్డులో డ్రగ్స్ ఫ్రీ 2కే రన్ నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి చేతుల మీదుగా గచ్చిబౌలిలోని రోలింగ్‌హిల్స్‌లో ఆయన నివాసంలో ఆవిష్కరించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి

కార్యక్రమంలో రాష్ట్ర విద్యాసమితి అధ్యక్షుడు తారక్‌గౌడ్, రవికుమార్, లయన్స్ క్లబ్ మెంబర్స్ అశోక్, నాయుడు, రమేష్, బెల్లంకొండ రామ్‌ప్రసాద్, భరత్ దాచేపల్లి, రామ్ గౌడ్ పాల్గొన్నారు.

పోరాటాలతోనే హాస్టళ్ల మెస్ చార్జీల పెంపు

మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య

రాంనగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బీసీ విద్యార్థి సంఘం చేసిన ఉద్యమాలు, పోరాటాల వల్లనే బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లకు మెస్‌చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం పెంచిందని, ఈ ఘనత విద్యార్థులదేనని మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలు, డిమాండ్ల పరిష్కారం కోసం బీసీ విద్యార్థి సంఘం నిరంతరం పోరాటం చేయాలని సూచించారు. ఆదివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. మెస్‌చార్జీలు పెంచాలని ధర్నాలు, ర్యాలీలు నిర్వహించడంతో ప్రభుత్వం స్పందించిందన్నారు. రాష్ట్రంలోని 7 లక్షలా 60 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎంలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమావేశానికి అధ్యక్షత వహించిన వేముల రామకృష్ణ మాట్లాడుతూ బీసీ విద్యార్థి సంఘం విద్యార్థుల డిమాండ్ల సాధన కోసం కృషి చేస్తుందన్నా రు. కార్యక్రమంలో మల్లేష్, వీరన్న, రాజేందర్, అనంతయ్య, రుషికుమార్, నిఖిల్‌పటేల్, బాలయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య, పక్కన వేముల రామకృష్ణ తదితరులు

రేపటి నుంచి స్వామి వారి ఆలయంలో పవిత్రోత్సవాలు

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సర్దార్‌పటేల్‌నగర్‌లోని శ్రీలక్ష్మీ గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 12వ తేదీ నుంచి మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23న సా యంత్రం 5 గంటలకు ధాత్రి కల్యాణము నిర్వహిస్తున్నామని, మహిళలు అందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. పవిత్రోత్సవముల్లో పాల్గొనే భక్తులకు పవిత్రము ఇస్తామని పేర్కొన్నారు.

పొగమంచు.. నడక పెంచు!



కుత్బుల్లాపూర్ హెచ్ఎంటీ కాలనీలో ఆదివారం కురుస్తున్న పొగమంచులోనూ వాకింగ్ చేస్తున్న స్థానికులు

కూల్చివేతలతోనే సరి
భూ పరిరక్షణ గాలికే!

- స్వాధీనం చేసుకోని అధికారులు
- కోర్టు ఆర్డర్ అంటూ తాత్సారం
- కబ్జాదారుల పేరుపైనే వెలుస్తున్న కాలనీలు

ప్రభుత్వ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను పోలీసుల సహాయంతో కూల్చి వేస్తున్న రెవెన్యూ అధికారులు... ఆ తర్వాత ఆ భూములను మాత్రం పూర్తి స్థాయిలో స్వాధీనం చేసుకునేందుకు వెనుకంజ వేస్తున్నారు. గాజుల రామారం డివిజన్‌లోని దేవేందర్‌నగర్, కైసర్‌నగర్, రావినారాయణరెడ్డినగర్‌లలో ఉన్న వందల ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాదారుల కబంధ హస్తాల్లో చిక్కుకొని కనుమరుగైంది. అంతేకాకుండా సదరు కబ్జాదారుల పేర్ల మీదనే బస్తీలు వెలిశాయి.



అధికారులు కూల్చివేసిన అక్రమ నిర్మాణాలు (ఫైల్)

గాజులరామారం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ మండలం సర్వే నెంబరు 329, 342, 307, 329/1ల్లో ఉన్న కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జాకు గురైంది. కబ్జాలను అరికట్టడంలో మండల రెవెన్యూ అధికారులు విఫలమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండలంలోని కొంత మంది అధికారులు, కింది స్థాయి సిబ్బంది కబ్జాదారులకు సహకరించారని వారిని ఉన్నతాధికారులు ఇప్పటికే ఉద్యోగాల నుంచి సస్పెండ్ చేశారు. అధికారులు మారుతుండటం, గతంలో ఉన్న అధికారులు కబ్జాదారులకు సహకరించడం, వారిచ్చే తాయిలాలకు ఆశపడి కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని కబ్జాదారుల వశం చేయడం దేవేందర్ నగర్ పరిసర ప్రాంతాల్లో పరిపాటిగా మారింది.

కోర్టు ఆర్డర్ ఉందంటూ
అధికారుల కాలయాపన

ప్రభుత్వ భూమిలో పాగా వేసిన కబ్జాదారులు కోర్టు ఆర్డర్ తెచ్చుకొని, ఈ భూమి తమదేనంటూ ఆక్రమించిన భూమిలో హెచ్చరిక బోర్డులను పాతి కాపలాగా కొందరు వ్యక్తులను ఉంచుతున్నారు. ఎవరైనా అటు పక్కకు వెళ్లితే.. ఇక్కడికి ఎందుకు వచ్చావని వెళ్లిన వారిని ప్రశ్నించడమే కాకుండా దౌర్జన్యానికి దిగుతున్నారని స్థానికులు చెప్తున్నారు. దేవేందర్ నగర్, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల దగ్గర రోడ్డుకు ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమిలో ఒక కబ్జాదారుడు పాగా వేసి, ఏకంగా చెట్లను నాటి, మనుషులను కాపాల పెట్టాడు. ఇదే స్థలంలో గతంలో కొంత మంది కబ్జాదారులు కోర్టు ఆర్డర్ ఉందంటూ, ఈ భూమి చుట్టూ రేకులతో ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, చుట్టూ సీసీ కెమెరాలు కూడా అమర్చుకుంటే గతంలో కుత్బుల్లాపూర్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్ అక్రమ కాంపౌండ్ వాల్‌ను పోలీసుల సహాయంతో కూల్చి వేశారు. అతను బదిలీపై వేరే ప్రాంతానికి వెళ్లి పోగా, కనీసం ఆ స్థలంలో రెవెన్యూ సిబ్బంది, అధికారులుగానీ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో లక్షలాది రూపాయలు చేతులు మారినట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

- ఇదే స్థలాన్ని ఆనుకొని ఉన్న స్థలంలో మరో కబ్జాదారుడు గతంలో ఇదే మాదిరిగా రేకులతో షెడ్డు వేస్తే అధికారులు కూల్చివేశారు. అయితే, అధికారులు ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోకుండా అలాగే వదిలేశారు. దీంతో కొంత కాలం సద్దుమణిగిన తర్వాత షెడ్డు వేసుకున్న కబ్జాదారుడు ఇప్పుడు ఆ స్థలంలో సిమెంట్ మెటీరియల్ తయారు చేస్తూ, ఈ స్థలం తమదేనంటూ బాహాటంగా చెప్పుకుంటున్నాడు. అయినా అధికారులకు కనువిప్పు కలుగడం లేదు.
- అలాగే గాజులరామారం గ్రామం నుంచి లాల్ సాబ్‌గూడకు వెళ్లే రహదారికి పక్కన ఉన్న సర్వే నెంబరు 12లో ఓ పాగా వేసి, ఈ భూమి తమదేనంటూ, రోడ్డును ఏర్పాటు చేయడంతో పాటు ఆ స్థలంలో హోటల్‌కు తెర లేపాడు. గతంలో ఈ భూమిలో హరితహారం కింద మేడ్చల్ జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, సమీప బస్తీవాసులు, జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారుల సమక్షంలో మొక్కలను నాటారు. అధికారులు వాటి సంరక్షణపై నిర్లక్ష్యం చేయడంతో పాతిన నెలరోజులకే ఆ మొక్కలు ఎండిపోయాయి. దీంతో ఆ భూమిపై కన్నేసిన కబ్జాదారుడు అధికారులను మచ్చిక చేసుకొని, కోర్టు ఆర్డర్ ఉందంటూ పాగా వేసుకొని కూర్చొన్నాడు. ఈ విషయంపై స్థానికులు రెవెన్యూ అధికారులను ప్రశ్నించగా కొంత భూమిని విద్యుత్ అధికారులకు కేటాయించాం. మిగిలిన భూమి కోర్టులో ఉంది. అది క్లియర్ అయిన తర్వాతే స్వాధీనం చేసుకుంటామని కుంటి సాకులు చెప్తున్నారు. ఇప్పటికి మూడేళ్లు గడుస్తున్నాయి. అధికారులు మారుతున్నారు, కానీ ఈ భూమిని స్వాధీనం చేసుకోవడంలో విఫలమవుతున్నారు.
- అలాగే కైసర్‌నగర్ సర్వే నెంబరు 342లో కబ్జాదారులు పాగా వేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించిన కబ్జాదారుడే తన పేరు మీదే బస్తీని ఏర్పాటు చేసుకొని రాజ్యమేలుతున్నాడు. ప్రభుత్వ స్థలం చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, నిరంతరం నిఘా నీడలో కబ్జాలకు పాల్పడుతున్నాడు. పలు మార్లు పత్రికల్లో వచ్చిన కథనాలకు స్పందిస్తున్న కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు తూతూ మంత్రంగా నిర్మాణాలను కూల్చి వేసి, ఆ తర్వాత వదిలేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కబ్జాకు గురైన భూములను కాపాడతారా? కబ్జాదారులకే వదిలేస్తారా? అనే సందిగ్ధంలో ప్రజలు ఉన్నారు.

ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే కఠిన చర్యలు



ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తున్నాం. దేవేందర్‌నగర్ పరిసర ప్రాంతాల్లో ఎంత భూమి కబ్జా అయ్యిందో పరిశీలించి, ఆ స్థలంలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తాం. ఇప్పటికే సర్వే నెంబరు 12లో బోర్డులను పాతాం. కబ్జా అయిన భూముల్లో బోర్డులను పాతి, త్వరలోనే స్వాధీనం చేసుకుంటాం.

- అబ్దుల్ రెహ్మాన్, కుత్బుల్లాపూర్ తహసీల్దార్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గాజులరామారం, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): గాజుల రామారం విద్యుత్ సబ్‌స్టేషన్ 11కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అంబేద్కర్ నగర్, భవానీనగర్, ఉమాదేవినగర్, శ్రీనివాస్‌నగర్, చిత్రాదేవినగర్, మల్లారెడ్డి నగర్, ఉషో దయాకాలనీ ఫేజ్-2, సాంస్కృతి ఎన్‌క్లేవ్, చంద్రగిరినగర్‌లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని ఏఈ చైతన్యభార్గవ్ ఒక ప్రకటనలో తెలిపారు.

జగద్గిరిగుట్ట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో...

జీడిమెట్ల, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): జగద్గిరిగుట్ట విద్యుత్ సబ్‌స్టేషన్ 33/11 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు దేవమ్మబస్తీ, పాపిరెడ్డినగర్, బీరప్పనగర్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సంజయ్‌పురి కాలనీల్లో విద్యుత్‌ను నిలిపి వేస్తున్నట్లు ఏఈ రాధాకిషన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.



ఫుట్‌బాల్ విజేత పియర్సన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): అంతర్ పాఠశాలల స్పోర్ట్స్ ఫెస్టివల్‌లో బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో పియర్సన్ స్కూల్ (కొంపల్లి) విజేతగా నిలిచింది. మల్కాజిగిరిలో వారం రోజులుగా జరుగుతున్న ఈ పోటీలు ముగిశాయి. అండర్-14 వాలీబాల్‌లో షేర్‌ఉడ్ స్కూల్, అం డర్-14 బాస్కెట్‌బాల్‌లో సాధు వైష్ణవి స్కూల్ జట్లు టైటి ళ్లు దక్కించుకున్నాయి. భారత ఫుట్‌బాల్ జట్టు మాజీ కెప్టెన్ విక్టర్ అమల్‌రాజ్ వీరికి ట్రోఫీలను ప్రదానం చేశారు.



శాలివాహన సభ్యులతో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కార్తీక వనభోజనాలు

జీడిమెట్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మట్టికి ప్రాణం పోస్తూ కుండలను తయారు చేయడమే కాకుండా కథన రంగంలోనూ తమ పరాక్రమం చాటిన వంశం శాలివాహన వంశమని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. చింతల్ డివిజన్‌లోని హెచ్ఎంటీ కాలనీలో ఆదివారం కుమ్మర (శాలివా హన) కార్తీక వనభోజనాలు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వేంకటేశ్వర దేవస్థాన మాజీ చైర్మన్ వేణుయాదవ్, కుమ్మర సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయానంద్, వీరేశం, శివనారాయణ, నాగేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

15 నుంచి ప్రత్యేక పూజలు

గాజులరామారం, నవంబర్ 10(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈ నెల 15 నుంచి గాజుల రామారంలోని నల్లగుట్ట లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో అభిషేకం, అర్చన, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు జరుగుతాయని ఆలయ చైర్మన్ ఇంద్రసేన గుప్తా, ప్రధాన కార్యదర్శి యాదగిరి తెలిపారు. కావున భక్తులు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆయన అన్నారు.



నల్లగుట్ట లక్ష్మీనర్సింహస్వామి

ఎన్ని రోజులు ఇలా వదిలేస్తారు!

- మెట్‌కానీగూడలో కుంగిన మ్యాన్‌హోల్
- ప్రమాదాలకు గురవుతున్న జనం



కుంగి ప్రమాదకరంగా ఉన్న మాన్యుహోల్ ఇదే

షాపూర్‌నగర్, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): గాజులరామారం డివిజన్ మెట్‌కానీగూడ గ్రామంలోని ప్రధాన రహదారిలో మ్యాన్‌హోల్ కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. నాలుగు నెలలు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోపోవడంతో రాత్రి వేళ ఈ మార్గంలో వచ్చే కొత్తవారు సుమారు అడుగులోతు ఉన్న మ్యాన్‌హోల్‌లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. పక్కనే ఉన్న మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయించిన అధికారులు దీనిని అలాగే వదిలేశారని, ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. జలమండలి అధికారులు ఈ మ్యాన్‌హోల్‌కు వెంటనే మరమ్మతులు చేయించి ప్రమాదాలను నివారించాలని వారు కోరుతున్నారు.



మంచి నీటి బోర్‌ను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ

ప్రతీ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

దుండిగల్, నవంబరు10(ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట ఇందిరమ్మ కాలనీలో తన సొంత నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన మంచి నీటి బోర్లను కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతీ కాలనీలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే తన లక్ష్యమన్నారు. అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడేది లేదని, ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న వార్డు అధ్యక్షుడు సోమరాజు భార్యను పరామర్శించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బుచ్చిరెడ్డి, సురేందర్‌రెడ్డి, మురళీయాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, వార్డు అధ్యక్షుడు కామేశ్వరరావు, సోమరాజు, కాలనీవాసులు భూషణ్, శ్యామ్‌రాజు, జయకుమార్, శ్రీనివాస్, బాబు, లక్ష్మణ్, దిలీప్, లక్ష్మమ్మ, ప్రభాకర్‌రావు పాల్గొన్నారు



ప్రిస్సిల్లా వెస్లీని శాలువాతో సన్మానిస్తున్న విజయ్ శేఖర్‌గౌడ్

కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు

దుండిగల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కృషి, పట్టుదల ఉంటే జీవితంలో సాధించలేనిది ఏదీ ఉండదని కార్పొరేటర్ విజయ్ శేఖర్‌గౌడ్ అన్నారు. చింతల్ డివిజన్‌కు చెందిన మేకల మనోహర్ కుమార్తె మేకల ప్రిస్సిల్లా వెస్లీ ఇండియన్ నేవీ (ఎస్ఎస్ఆర్)లో విజయం సాధించింది. ఈ సందర్భంగా ఆమె స్థానిక నాయకులతో కలిసి కార్పొరేటర్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. విజయ్ శేఖర్ గౌడ్ ఆమెను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డేగల రాము, మురళీ, ఆదినారాయణ రెడ్డి పాల్గొన్నారు.

విలేకరులపై దాడి: కేసు నమోదు

గాజులరామారం, నవంబర్ 10(ఆంధ్రజ్యోతి): న్యూస్ కవరేజ్ కోసం వెళ్లిన ఓ టీవీ ఛానల్ విలేకరులపై దాడి చేసిన సెక్యూరిటీ సిబ్బంది, బౌన్సర్లపై సూరారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ భరత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం మల్లారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. ఆ న్యూస్ కవరేజ్‌కని వెళ్లిన ఓ ఛానల్ విలేకర్లపై సెక్యూరిటీ సిబ్బంది దాడి చేశారు. బాధిత విలేకర్లు సూరారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



షాపూర్‌నగర్‌లోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్తీక మాస వన సమారాధనలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కన్యాకా పర మేశ్వరి ఆశీస్సులు అందరిపై ఉండాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్ గుప్తా, పవన్ గుప్తా, వంశీ పాల్గొన్నారు.

- (గాజులరామారం,ఆంధ్రజ్యోతి)

సదర్ సందడి

జగద్గిరిగుట్టలో ఆదివారం రాత్రి సదర్ ఉత్సవాలు సందడిగా సాగాయి. యాదవులు తమ దున్నలను ప్రత్యేకంగా అలంకరించి తీసుకొచ్చారు. వాటితో చేయించిన విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో యాదవులు, స్థానికులు పాల్గొన్నారు.







